


ట్యాక్సీ కార్లన్నీ యించుమించుగా ఒకదాని తర్వాత ఒకటి వెళ్ళిపోయాయి. కాని, డ్రైవరు వెంకన్నకి మాత్రం యింకా బేరం తగల్లేదు. అలాగే ఆశతో కూర్చుండిపోయాడు. విద్యుద్దీపాలప్పుడే వెలిగాయేమో- చేతిలో ఒకసారి 'శ్రీరామ' అని వ్రాసి కళ్ళకద్దుకుని మళ్ళీ కాళ్లు ముడిచిపెట్టుకుని ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు.

చీకటి పడగానే తోటి డ్రైవర్లందరూ ఇళ్ళకి వెళ్ళడానికి కంగారు పడతారు. ఒక్కసారైనా పెళ్ళాం బిడ్డల్ని చూస్తేకాని మనసొప్పదు- వాళ్ళకి. అయినా తనకా తాపత్రయం లేదు! అందరికీ పెళ్ళాంబిడ్డ లున్నారు కాబట్టి తాపత్రయ పడతారు- కానీ తన కెవరున్నారు?... బిడ్డలసలు లేనేలేరు. ఉన్న పెళ్ళాం కాస్తా గుడిసెమీద దెబ్బతీసి లేచిపోయింది. లేచి వెళ్ళిపోవలసినంత అపరాధమేం చేశాడు- తను? కోరిందల్లా యిచ్చేవాడు. చెప్పిందల్లా చేసేవాడు ...ఎంత తియ్యగా కబుర్లు చెప్పేది! ఇలా జరుగుతుందని తను కల్లోనైనా అనుకున్నాడా? వెంకన్న పెళ్ళాం లేచిపోయిందని పదిమందీ గుసగుసలాడుకుంటూంటే తనెంతగా కుమిలి కుమిలి ఏడ్చేవాడు? తను కాబట్టి ఇంత అవమానం జరిగినా వూరుకున్నాడు- మరొకడైతేనా?... ఆఁ అ... వూరుకోకపోతే ఏం చేయగలడు తను? ఇంతకీ...ఇదంతా తన కర్మ! కాకపోతే ఏమిటి మరీ వెధవ బ్రతుకు?.......ఉత్తినే కూర్చుంటే వెంకన్న కిదే ఆలోచన!...అందుకనే సాధారణంగా ఎన్నడూ ఊరికే కూర్చోడు- ఏవో నాల్గు డబ్బులొస్తే హాయిగా కడుపునిండా తాగేసి, మిగిలిందంతా చీట్లపేకలో తగలేస్తూ రాత్రంతా గడుపుతాడు. పక్కనున్న డ్రైవర్లంతా అంటూంటారు. 'అలా డబ్బు తగలెయ్యకపోతే మళ్ళీ పెళ్ళి చేసుకోకూడదా, ఏంరా వెంకన్నా' అని. కాని నిజానికి వెంకన్న ఎప్పుడూ మళ్ళీ పెళ్ళి గురించి అంతగా ఆలోచించలేదు. అప్పుడప్పుడు దానంతట అదే ఆలోచనలో కొచ్చేది. అప్రయత్నంగా ఆలోచించేవాడు: తనకి పెళ్ళెందుకు? అది కూడా కొంపతీసి ఇలాగే లేచిపోతే?......'డ్రైవరు వెంకన్న రెండో పెళ్ళాం కూడా లేచిపోయిం'దని పదిమందీ చెప్పుకుంటూంటే తనకెంత నామోషీ! పదిమందిలో తను తలెత్తుకు తిరగ్గలడా?... 'టప్ టప్' మని పడుతున్న వానచినుకుల చప్పుడుతో వెంకన్న బుర్రకి అమాంతంగా బ్రేకుపడినట్లయింది. ఆకాశమంతా మబ్బుల మయమైపోయింది. గాలి 'రివ్వు' మని వీస్తోంది. 'వర్షం పెద్ద దయ్యేలాగుంది, పోతే మంచి,' దనుకుంటూ

★ ముష్టి దుర్గాగణేశదత్ ★

కార్లో అడుగుపెట్టబోతున్నాడు వెంకన్న.

'డ్రైవర్ !' ఎవరో పిల్చారు. గబుక్కున వెనక్కి తిరిగి చూశాడు. ఎవరో మొగుడూ పెళ్లాల్లా ఉన్నారు— చెయ్యీ చెయ్యీ కట్టుకు వస్తున్నారు.

'రాయల్ బిల్డింగ్స్' అన్నాడు పురుషుడు —స్త్రీని చేత్తో పట్టుకుని కారుదగ్గరకు వస్తూ.

లైట్ల వెలుగులో అమ్మగారి ముఖం తళుక్కున మెరిసింది. వెంకన్న ఎందుచేతో ఒక్క నిమిషం దాకా మాట్లాడలేక పోయాడు! కళ్లు గట్టిగా ఒకసారి నులుముకుని, వాళ్లిద్దరి కేసి అదే ధ్యానంగా చూస్తూ నిలబడిపోయాడు కొయ్యబొమ్మలాగ.

'ఏయ్, నీకే చెప్పేది!' కటువుగా అరిచాడు, ఆ కేకవేసిన మొగాడు.

వెంకన్న మాట్లాడకుండా తలుపు తెరిచాడు. పురుషుడు సవిలాసంగా కార్లో కూర్చున్నాడు, స్త్రీతో సహా- వెంకన్న మళ్లీ స్త్రీకేసి ఒకసారి చూసి లోపలికి వెళ్లి తలుపేసుకున్నాడు.

కారు 'బర్' మంటూ పోతోంది. డ్రైవరు వెంకన్నకి ఒళ్లు తెలియటం లేదెందుచేతో. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు...తనభార్య లాగే వుంది! అచ్చంగా తనభార్యే...ఆ నొక్కుల జడా, మధ్యపాపిడీ... ఒకవేళ తను పొరబడుతున్నాడేమో? ఛా !ఛా ! తనెందుకు పొరబడతాడు? ఆమాత్రం పెళ్లాన్ని గుర్తించుకోలేనంత మందబుద్ధా తను? అదీగాక తనెంత నిదానంగా చూశాడు- ఆ గుండ్రటి ముఖంమీద లైట్లకాంతి పడ్డపుడు......'

'ఏయ్, కొంచెం స్పీడు తగ్గించు' అని కారు లోపలి పురుషుడు అసహ్యంగా గదమాయించాడు. కారు వేగం తగ్గింది. వెంకన్నకి మనసులో ఆదోవిధంగా వుంది. వెనక్కి తిరిగి చూశాడు- 'వాళ్లిద్దరూ ఎంత దగ్గిరగా కూర్చున్నారూ...' ఒక్కసారిగా వెంకన్న శరీరం జలదరించింది. తల దిమ్మెక్కినట్టయింది. వెనకనుంచి మాటలు వినపడుతున్నాయ్.

'ఇంటికి వెళ్ళకపోతే మీగురించి మీ ఆవిడేమనుకుంటుందో?...'' స్త్రీకంఠం అనుమానాన్ని సూచిస్తూ వెటకారంగా అంది.



'ఏమనుకుంటుంది?' పురుషుని గొంతు ఈసడింపుగా అంది. వెంకన్న శ్రద్ధగా వింటున్నాడు—

చెదరిపోతున్న మనసును కట్టి పెట్టుకుని వెంకన్న ఎలాగో 'రాయల్ బిల్డింగ్స్' దగ్గిరకి కారును చేరవేశాడు.

పురుషుడు అయిదురూపాయల నోటందిస్తూ అన్నాడు: 'ఒక రూము మాట్లాడిరా!' వెంకన్నకి ఒళ్ళంతా తేళ్లూ జెర్రెలూ పాకినట్లయింది. నెమ్మదిగా కాళ్ళీడ్చుకుంటూ లోపలికి వెళ్ళి ఐదునిమిషాల తర్వాత యివతలకి వచ్చాడు.

'మాట్లాడేవా?' పురుషుడు అధికారస్వరంతో అన్నాడు. 'ఆఁ'అంటూ వెంకన్న లోపలికి దారి తీశాడు. వెనకాల స్త్రీపురుష లిద్దరూ వెళ్లారు. ఒక గదిదగ్గిరకి వెళ్లి తలుపుతోసి చూపిస్తూ అన్నాడు—'ఇదే'.

స్త్రీ అంది: 'సరే- అన్నట్టు వర్షం లేదుగా! కింద నుండు. మళ్లీ పిలుస్తాం.' ఈ మాటతో వెంకన్నలో ప్రతిశక్తి చచ్చినట్లయిపోయింది. నెమ్మదిగా కిందకి దిగి చుట్ట వెలిగించి కూర్చున్నాడు, ఆలోచిస్తూ. తనభార్యే! నిజంగా తన భార్యే! ఇంకా అనుమాన మెందుకు? ఎంత పని చేస్తోంది? బ్రతుకు...తన్ను కొంచెమైనా గుర్తు పట్టలేక పోయింది-ఛీ! ఛీ!- ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయింది. కూర్చోలేక పోయాడు. చప్పుడు చేయకుండా గదిదగ్గిరకి బయలుదేరాడు. కిటికీ తలుపులు తీసివున్నాయి. ఎలక్ట్రిక్ దీపం కాంతులు తనమీద పడుతున్నాయి. 'ఛన్' మని తిప్పేసుకున్నాడు తల. ముచ్చెమటలు పొయ్యడం ప్రారంభించాయి. నిలబడలేకపోయాడు. నెమ్మదిగా గోడకి ఆనుకుని తేలిపోయే అడుగులతో వెళ్లి కారుదగ్గిర కూర్చున్నాడు. అలా ఎంతసేపున్నాడో తనకి తెలియదు.

"డ్రైవర్!" అమాంతంగా ఉలిక్కిపడి లేచాడు, అప్రయత్నంగా 'సార్' అంటూ.

'ఎన్నిసార్లు పిలవాలి?...వినపడలేదూ?' ఆడది గుడ్లెర్రచేస్తూ అడిగింది.

'లేదు' ముక్తసరిగా జవాబు చెప్పాడు. ఎక్కడనుంచో 'ఛన్ ఛన్' మని తొమ్మిది గంటలు వినపడేప్పటికి వెంకన్న ఉలిక్కిపడ్డాడు. 'అబ్బా! చాలాసేపు కూర్చున్నానే!' అని మనసులో అనుకుంటూ.

'హిందీ పిక్చర్ ఎందులో ఆడుతోందో తెలుసా!' స్త్రీ కంఠం అడిగింది.

'ఆఁ' వెంకన్న ముక్తసరిగా అన్నాడు. ఇద్దరూ కార్లో కూర్చున్నారు.

'తీసుకెళ్ళమన్నారా?' వెంకన్న అడిగాడు. 'ఊఁ' - స్త్రీస్వరమే మళ్లీ అంది.

కారు స్పీడుగా పోనిస్తున్నాడు. అంతకంతకీ స్పీడు హెచ్చిపోవడం చూసి స్త్రీ పురుషులిద్దరూ కంగారు పడ్డారు. 'స్పీడు తగ్గించు' అన్నాడు మొగాడు రెండు మూడు సార్లు. వెంకన్న తనకి వినపడనట్టే వూరుకున్నాడు. మొగాడికి కంగారెక్కువైంది.

'ఏయ్, స్పీడు తగ్గించు' మొగగొంతు కంగారుగా అంది.

'ఏయ్, నిన్నే!' ఒక్క పొలికేక పెట్టింది.

'బాబోయ్! కారు...కారు' స్త్రీ కంఠం ఒణికిపోయింది. ఎదురుగా వచ్చే కారును 'డేష్' చేసేలా పోనిచ్చాడు వెంకన్న.

'కళ్లు కనబట్టంలేదా? ఫూల్!' మొగాడు ఒణికే గొంతుకతో తిడుతున్నాడు.

కారు స్పీడు మరీ హెచ్చిపోయింది—

'ఆపు చెయ్!' మొగాడు గట్టిగా అరిచాడు. కా రాగలేదు. పురుషుడు కంగారుగా తలుపు తీసుకుని దూకేశాడు. కా రాగలేదు.

'అమ్మోయ్! కళ్లు తిరిగి పోతున్నాయ్!' స్త్రీ స్వరూపం డ్రైవరు భుజంమీద పడిపోయింది. దాంతో చటుక్కున డ్రైవరు చేతిపట్టు తప్పింది- కారు 'ఛన్' మని చెట్టుకి కొట్టుకుంది. జనం చుట్టూ మూగుతున్నారు—

వెంకన్న నెమ్మదిగా కళ్లు తెరిచి, బాధగా నవ్వుతూ 'బాగున్నావా, సీతా!' అన్నాడు.

'ఎ...వ...రూ...' అంటూ అతని భుజం మీదకి పాకి, బాధగా అతని ముఖంలోకి చూస్తూ.

'తెలియదూ? వెంకన్నని'కటువుగా అన్నాడు. లేని శక్తిని తెచ్చుకొని.

'సువ్వా' గట్టిగా అతన్ని కౌగిలించుకుంది. వెంకన్న మాట్లాడలేదు. ఆమె వీపుమీద తన రెండుచేతులూ వేస్తూ - ఆమె గాఢ పరిష్వంగంలో ఒక్క మూలుగు మూలిగి-కళ్లు మూశాడు.